విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 31, డిసెంబర్ 2023

చర్చల పేరుతో కాలయాపన తగదు..

- మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి ..
- జనవరి 3వ తేదీన సమ్మెలోకి వెళ్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మెబాట
- ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున..

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలని, 26వేల రూపాయలు జీతాలు పెంచాలని పలు డిమాండ్లతో జనవరి 3వ తేదీ నుండి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన కార్యక్రమంలో భాగంగా అనంతపురం టవర్ క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహం దగ్గర కళ్లకు గంతులు కట్టుకొని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య ఆహ్వానితులుగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మల్లికార్జున, ఏఐటీయూసీ నగర కార్యదర్శి వికె కృష్ణుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా అధ్యక్షులు జి చిరంజీవి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి రాజులు హాజరై మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వ పెద్దలు రెండు దఫాలుగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించడంలో ముందుకు పోనందున జనవరి 6 నుండి చేయాల్సిన సమ్మె జనవరి 3 నుండే సమ్మెలోకి పోతున్నామన్నారు.కరోనాను లెక్కచేయకుండా పనిచేసి మరణించిన కార్మికులకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ఇవ్వకుండా మోసం చేశారన్నారు.2014 సం, కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నా 10,400 మంది మాత్రమే పర్మినెంట్ అవుతారన్నారు,35 వేల మంది ఉన్న మున్సిపల్ కార్మికులకు మాత్రం ద్రోహం చేశారన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలబెట్టుకొని మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.భారత దేశంలో ఒక్క కుటుంబం జీవించాలంటే 26 వేలు అవసరం అని ప్రభుత్వ లెక్కలు చెబుతుంటే రాష్ట్రంలో మాత్రం చాలీచాలని వేతనాలు ఇస్తున్నారన్నారు.మున్సిపల్ ఇంజనీరింగ్,పారశుద్ధ్య కార్మికులు అని తేడాలేకుండా 26 వేలు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు.స్కూళ్లలో పనిచేస్తున్న స్వీపర్స్, వాచ్‌మన్లకు రూ.4 వేలు వేతనం ఇస్తూ గొడ్డుచాకిరి చేపిస్తున్నారన్నారు. ఫుల్ టైమ్ వర్కర్లుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు.ఆప్కాస్ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు.60 సం,లు పూర్తి అయిన, అనారోగ్యం పాలైన ఇంజనీరింగ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోవాలన్నారు.మున్సిపల్ కార్మిక సంఘం నాయకులతో చర్చించి సమ స్యలు పరిష్కరించాలన్నారు.లేదంటే జనవరి 3 నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వేణుగోపాల్, సహాయ కార్యదర్శి నాగరాజు, నాయకులు బాబు, తిరుమలయ్య, ప్రసాద్, ఎరాప్ప, శివకృష్ణ, రామాంజి, అసేన్, దేవమ్మ, శంకర్ పాల్గొన్నారు.

పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా ఇంచార్జి కలెక్టర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ఈనెల 31వ తేదీన ఆదివారం పశుసంవర్ధక సహాయకుల ఎంపిక పరీక్షలు ఆన్లైన్ పద్ధతిలో జరగనున్నాయని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పశుసంవర్ధక సహాయకుల ఎంపిక పరీక్షలపై సంబంధిత శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ఆది వారం పశుసంవర్ధక సహాయకుల ఎంపిక పరీక్షలు అనంతపురం నగరంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, పివికెకె ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ బాలాజీ పీజీ కళాశాల, రోటరీపురం లోని శ్రీనివాస రామానుజన్ ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఆర్ఐటి), తాడిపత్రి పట్టణంలోని సర్ సివి రామన్ ఇంజనీరింగ్ కళాశాల, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాలుగా 925 మందికి పరీక్ష నిర్వహించనున్నారన్నారు. ఈ సమీక్షలో పశుసంవర్ధక శాఖ జేడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అన్నింటా అభివృద్ధి చేశాం.. జనంలోకి ధైర్యంగా వస్తున్నాం

- అంతే ధైర్యంతో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి జనంలోకి రాగలరా
- మాజీ మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర-రాప్తాడు: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం కాబట్టే.. ఐదేళ్లుగా జనంలో ధైర్యంగా తిరుగుతున్నామని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండలం పంగల్ రోడ్డు, మైనారిటీ కాలనీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. మినీ మేనిఫెస్టోకు సంబంధించిన ప్రతి పథకం ప్రాధాన్యతను వివరిస్తూ దాని వల్ల ఎంత లబ్ధి జరుగుతుందన్నది తెలియజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఈ పథకాలన్నీ అమలు చేస్తామన్నారు. మరోవైపు రాప్తాడు నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందించామన్నారు. అందుకే ఇంత ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామని.. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అధికారం ఉంది కాబట్టి జనంలో తిరుగుతున్నారని లేకపోతే ఆయన అడ్రస్ కూడా ఉండదన్నారు. ఏ ఒక్కరైనా ఆయన పట్ల సానుకూలంగా ఉన్న పరిస్థితి లేదన్నారు. చాలామంది కేసులకు భయపడి ఆ పార్టీలో కొనసాగుతున్నారని లేకుంటే ఈపాటికి ఆ పార్టీ ఎప్పుడో ఖాళీ అయ్యేదని సునీత అన్నారు. కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, సర్పంచ్ సాకే తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ విద్యార్థుల ప్రతిభ..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత విజ్ఞాన ప్రదర్శనలో ఉరవకొండ ప్రభుత్వ సెంట్రల్ హై స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఇన్ఫినిటీ వాక్‌తొ సంపూర్ణ ఆరోగ్యం అనే ప్రదర్శనకు ప్రభుత్వ హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న బి.అశ్రిత నాలుగవ స్థానాన్ని సాధించారు. అలాగే రూబిక్ క్యూబ్ ప్రదర్శనలో ఆరవ తరగతి చదువుతున్న అరుణ్‌కుమార్ జిల్లాస్థాయి ప్రథమ స్థానాన్ని సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు ఏపీఎంఎఫ్ ప్రతినిధుల బృందం చేతులమీదుగా జ్ఞాపిక ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, గణిత ఉపాధ్యాయుడు, గైడ్ తాటికొండ వెంకట్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆకట్టుకున్న పోలీస్ సాంస్కృతిక కార్యక్రమాలు

అభినందించిన ఎస్పీ

అభినందిస్తున్న ఎస్పీ అన్బురాజన్..

శాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తాయి. ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ .. పోలీసు కుటుంబ సభ్యులు పాడిన పాటలు, నృత్యాలు తిలకించారు. కూడేరు ఎస్సై సత్యనారాయణ, తన కుటుంబ సభ్యు లతో కలసి తబలా, ఫ్లూట్, క్యాసియో ప్లేలు ఆకట్టుకున్నాయి. ఎస్సై సుధాకర్ యాదవ్ కూతురు మహతి మనోజ్ఞ యాదవ్ చేసిన కూచిపూడి నృత్యం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనపరిచిన వారిని ఎస్పీ మెమొంటోలతో సత్కరించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు సీఎం గంగయ్య, బి.శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి, పలువురు సి.ఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, శ్రీనివాసుల నాయుడు, శివప్రసాద్, రమణ, సరోజ పాల్గొన్నారు.

చంద్రబాబు దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు, కలెక్టరేట్ ఎదురుగా నిరసనలు చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు ఆయన మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు, రాష్ట్రంలో ఒకవైపు అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, తమ సమస్యలు పరిష్కరించాలని పది రోజులుగా నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ పర్మినెంట్ చేస్తామని, సిపిఎస్ రద్దు, మద్యపాన నిషేధం వంటి హామీలను తుంగలో తొక్కారని, గతంలో నిరసనలు తెలియజేస్తే రెండు మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరించే వారిని, ప్రస్తుతం మంత్రులు ముఖ్యమంత్రి ఏవీ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సమస్యలన్నింటినీ టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోతుల లక్ష్మీ నర్సింహులు, సైపుద్దీన్, జేయం భాష, మార్కెట్ మహేష్, చెరుకు తోట పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : జిల్లాలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా డాక్టర్ స్వామినాథ సిఫారసును అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుత కరువు పరిస్థితుల్లో అనంతపురం జిల్లా రైతాంగానికి పదివేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలన్నారు. రైతుల అప్పులను రద్దుచేసి, ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు ఇక ప్రాధాన్యత ఇచ్చి, హెచ్ఎల్సీ కెనాలును ఆధునీకరణ చేపట్టాలన్నారు. హంద్రీనీవా, పీఏబీఆర్ కింద ఆయకట్టును స్థిరీకరించి పొలాలకు నీరు ఇవ్వాలన్నారు. పేరూరు కుందుర్పిమీదుగా బీటీపీ ప్రాజెక్టును నిర్మించాలని, కళ్యాణదుర్గంలో 114 చెరువులకు నీరు నింపాలన్నారు. కృష్ణా జలాల పునః పంపిణీకి గెజిట్ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేసి అప్పర్‌భద్ర నిర్మాణాన్ని ఆపాలి అని అన్నారు. డ్రిప్పు, స్ప్రింకర్లను 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చెన్నప్ప యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పి రామకృష్ణ,జిల్లా కార్యదర్శి టి.నారాయణస్వామి,రైతు సంఘం నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్స్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం 2024 డైరీ, క్యాలెండర్, 2024లో విడుదలైన జీవోలతో కూడిన పుస్తకం, స్టిక్కర్ క్యాలెండర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య, అనంతపురం జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శులు, నారాయణస్వామి, మల్లికార్జునలు ఆవిష్కరించారు. ఎస్టీయూ స్వాతంత్రానికి పూర్వమే ఆనాటి నిర్బంధాలను ఎదుర్కొని ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాన్ని సాగించి అనేక విజయాలు సాధించిందన్నారు. డిఏలు, పీఆర్సీలు సాధించడం, అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన, ఇంటి అద్దె పెంపుదల అనేక సౌలభ్యాల సాధనలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయు అగ్రభాగాన నిలబడి పోరాటం చేసిందన్నారు. ప్రస్తుతం జీవో నంబర్ 117 అమలు చేసి పాఠశాల విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థ కుప్పకూలిందని, ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చేరిపోయారన్నారు. రాష్ట్రంలో 9వేల పాఠశాలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. పాత పెన్షన్ పునరుద్ధరణ చేయించుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్స్ రామాంజ నేయులు, శివయ్య చారి, కృష్ణమోహన్, పణి భూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, నాగభూషణ,సురేష్ జిల్లా కార్యదర్శి చలపతి, మురళీకృష్ణ, విశ్వనాథ్ గౌడ్, ఎస్టియు బుక్కరాయసముద్రం మండలాధ్యక్షుడు బాబ్జి నాయక్, వెంకటేష్, రామకృష్ణ,వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శింగనమల కానిస్టేబుల్ షబ్బీర్ సస్పెన్షన్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: శింగనమల కానిస్టేబుల్ షబ్బీర్ ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. షబ్బీర్ ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియా, పత్రికలలో వైరల్ కావడంపై ఎస్పీ తక్షణమే స్పందించారు. ప్రాథమిక విచారణ ఆధారంగా ఎస్పీ సస్పెన్సన్ ఉత్తర్వులు జారీ చేశారు. శింగన మల పోలీసు స్టేషన్ కు ఎదురుగా ఉన్న లేడీస్ కార్నర్ వద్ద కొంత మంది యువకులుపై కానిస్టేబుల్ షబ్బీర్ శుక్రవారం రాత్రి దురుసుగా ప్రవర్తించాడు. అడ్డుగా వెళ్లిన మహిళ పట్ల దురుసుగా వ్యవహరించినట్లు వైరల్ కావడంపై ఎస్పీ సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై డీఎస్పీ స్థాయి అధికారి ద్వారా సమగ్ర విచారణ జరిపించేలా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుల్‌పై డీఎస్పీ విచారణ : డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ షబ్బీర్ నిన్న రాత్రి పీకల దాకా మద్యం సేవించి రోడ్డుపై వెళ్తున్న ప్రజలను మహిళలను దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలోనూ వార్తాపత్రికలలో హల్‌చల్ చేయడంతో ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి శనివారం శింగనమల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌పై విచారణ చేపట్టారు. నివేదిక ఎస్పీకి సమర్పిస్తానని తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర కాదు జగన్ రెడ్డి.. మా ఉద్యోగాలు ఎక్కడ?

విశాలాంధ్ర-గుంతకల్లు: అడుదాం ఆంధ్ర పేరుతో జగన్‌రెడ్డి విద్యార్థులను నిరుద్యోగులను మోసం చేస్తున్నారంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని అజంత సర్కిల్ దగ్గర కబడ్డీ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వినోద్ వెంకట్ నాయక్ మాట్లాడుతూ అడుదాం ఆంధ్ర పేరుతో ఎన్నికలు వస్తున్న సమయం దగ్గర పడుతున్న వేళా విద్యార్థులను నిరుద్యోగులను నమ్మించి మరోసారి మోసం చేయాలని కుట్రతో అడుదాం ఆంధ్ర పెరుతో ముందుకు వచ్చారని తెలిపారు. క్రీడాకారులకు ఎక్కడా సరైన సదుపాయాలు లేవన్నారు. ఇండోర్ స్టేడియంలో కోచ్‌లకు జీతాలు చెల్లించాలేని స్థితి ఉందన్నారు. బ్యాట్లు ఒక్క బంతి కొడితేనే విరిగిపోతున్నాయని మండిపడ్డారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందనే... క్రీడల పేరుతో మతలబు చేస్తున్నారన్నారు. కానీ నిరుద్యోగులు జగన్‌ను నమ్మే పరిస్థితి లేదని హెచ్చరించారు. జిల్లాలో హాస్టల్ మరమ్మతుల కోసం నిధుల కేటాయించమని సంవత్సరం నుంచి అడుగుతున్నా చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి అఖిల్ కుమార్ పట్టణ నాయకులు శ్యాంసుందర్ ఫరాన్ నరసింహ కేశవ రోహిత్ కిషోర్ కిరణ్ మోహన్ తేజ రాహుల్ మోక్షిత్ కుమార్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర-రాప్తాడు: ఆసుపత్రి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జగనన్న అరోగ్య సురక్ష-1 కు సంబందించి నివేదికలు, రికార్డులను పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరు పట్టిక, గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునేలా అవగాహన కల్పించారు. జగనన్న అరోగ్య సురక్ష-2 గురించి ప్రణాళికలు, ప్రత్యేక వైద్యుల వివరాలు, మందులు, పరీక్ష చేసే కిట్స్ గురించి అడిగారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, ఫార్మాసిస్ట్ మూర్తి, స్టాఫ్ నర్స్ లక్ష్మీ, ఏఎన్ఎం లీలావతి పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా నూతన కమిటీ

ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్

విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : జిల్లాలోని బిజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో 13వ మహా సభలు ఘనంగా నిర్వహిం చారు. ఈ మహా సభ కు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, 300మంది రైతు సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన ఏపీ రైతు సంఘంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డి.చెన్నప్ప యాదవ్, ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జున, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి. గోవింద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి,వన్నారెడ్డి,కోశాధికారి బండి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకట్ రాముడు, పి.రామకృష్ణ, శర్మస్‌వలి, గోపాల్, కార్య దర్శులు పి.నరసింహులు, టి.నారాయణస్వామి, నసప రామకృష్ణ, లలితమ్మ లతో పాటు 26 మందిని కార్యవర్గ సభ్యులుగా, 56 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు

విశాలాంధ్ర-యాడికి : అయోధ్య రాముని పూజిత అక్షింతలు యాడికి మండల కేంద్రంలో ఘనంగా ఊరేగించారు. మండల కేంద్రంలోని చందన రోడ్డు సమీపంలో గల శ్రీరామ ఆలయం నుంచి సీతారామ లక్ష్మణ విగ్రహాలను మరియు అక్షింతలను యాడికి పురవీధుల గుండా భక్తులు ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమానికి యాడికి మండలంలోని వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్ గోశాలకు గడ్డి వితరణ..

విశాలాంధ్ర-కణేకల్లు: జిల్లాలోని ఇస్కాన్ దేవాలయం గోశాలకు తన సొంత ఖర్చులతో కనేకల్ నుండి అంతపురం గోశాలకు ట్రాక్టర్ వరిగడ్డిని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర క్రాకర్స్ యజమాని, పత్రికా విలేఖరి కటిక ఉదయ్ కుమార్ శుక్రవారం పంపించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ కనేకల్ మండలం అంటేనే వరి పండించడంలో అగ్రస్థానంలో ఉందని, జిల్లాలో కూడేరు గోశాల, కసాపురం గోశాల, కనేకల్ అయ్యప్ప స్వామి దేవాలయం గోశాల, ఇతర గోశాల్లో గోవులు గడ్డి లేకుండా చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇస్కాన్ టెంపుల్ వారు అడగడంతో సొంత ఖర్చులతో టెంపుల్‌కు గడ్డిని తరలించినట్లు తెలిపారు. పుణ్యం కోసం మనం అన్నదానం, వస్త్ర దానం, ఇంకా ఎన్నో చేస్తూ ఉంటామనీ, కోటి దేవతలు కొలువై ఉండే గోమాతను మనం మరుస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని గోశాలలకు గడ్డి అందించేలా ఆ దేవుడు తనకు అవకాశం ఇవ్వాలని కోరుకున్నారు. దాతలు మరింత మంది ముందుకొచ్చి గోవుల సంరక్షణకు చేయూత నివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల్యం మాబు, మారెప్ప, రాజేష్, రుద్ర పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటరాముడు యాదవ్ ఎన్నిక

విశాలాంధ్ర-యాడికి: పెద్దవడుగూరు మండలం ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో 13వ జిల్లా మహాసభలలో రైతు సంఘం నూతన కమిటీని ఎన్ను కున్నారు. నూతన కమిటీలో పెద్దవడుగూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు యాదవ్‌ను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతామన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సిపిఐ జిల్లా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా రైతు సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతర జ్ఞాన సంపద అర్జించాలి

వీసి జి.రంగ జనార్ధన్

విశాలాంధ్ర-జేఎన్‌టీయూఏ: నిరంతర జ్ఞాన సంపదను ఆర్జించాలని ఉప కులపతి ఆచార్య జింక జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ పేర్కొన్నారు.. శనివారం సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ కళాశాల స్థాయిలో మానవీయ విలువలతో కూడిన విద్యపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్య నైతిక కోణాలను లోతుగా అర్థం చేసుకోవడానికి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తారని, విద్యావిషయక జ్ఞానంతో పాటు పాత్ర అభివృద్ధిని ప్రోత్సహిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలను వీసి, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆచార్య విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్వి.సత్య నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.అరుణకాంతి, పులివెందుల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ జి.మమత, పి.ఆర్.ఓ. డాక్టర్ యం.రామశేఖరరెడ్డి విద్యార్థులను అభినందించారు.

వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం..

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నాహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకీ ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎటు చూసినా అసంతృప్తి జ్వాల

- రాష్ట్రంలో వైసీపీ ప్రజాస్వామ్యాన్ని హరిస్తోంది..
- మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: రాష్ట్రంలో ఎక్కడ చూసినా అసంతృప్తి జ్వాలలు, బావప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం హరిస్తోందని అనంతపురం మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శనివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో వైసీపీ ప్రభుత్వ బీసీ సాధికారిత బస్సుయాత్ర డ్వాక్రా మహిళలను, ఇతరులను నిర్బంధించి, ఒక భగీరథ ప్రయత్నం చేశారని, బీసీల సాధికారతను, సామర్థ్యాన్ని నిర్వాహకులు పాటించారా లేదా అని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఒక బీసీ ఎంపీకి వేదిక మీద మీరిచ్చే, గౌరవం ఇదేనా అని విమర్శించారు. మీ ప్రభుత్వ విదానాలు సంక్షేమం గురించి, ఏమి చేసిందో చెప్పకుండా, మాజీ మంత్రి పేర్ని నానికి చంద్రబాబు వయసు గురించి పవన్ కళ్యాణ్ హెయిర్ స్టైల్ గురించి విమర్శించడమే సరిపోయిందన్నారు. కేవలం వెంకట్రామిరెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడానికి మీరు వచ్చినట్లుగా తెలుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల నిరసనలు, మున్సిపల్ కార్మికుల సమ్మె, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసనలు, ధర్నాలు చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ ఇచ్చిన ఘనత ఎన్టీఆర్ దే అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వేల పట్టాలు ఇచ్చామని, టిడ్కో ఇల్లు 90 శాతం పూర్తి చేస్తే, అధికారులకు ఇవ్వకుండా, అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మీ ప్రభుత్వంలో దాడులు చేయడం కేసులు పెట్టడం భావ స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని హరించడం తప్ప మీరు చేసిన అభివృద్ధి ఏదీ లేదని అన్నారు.

రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలి

సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో టీడీపీ కదిరి నియోజకవర్గ ఇంచార్జి కందికుంట వెంకటప్రసాద్ సంఘీభావం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: స్థానిక బస్‌షెల్టర్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు గుంతల పడి వాహనాల రాక పోకలకు తీవ్ర ఆటంకంగా ఉన్న తరుణంలో గుంతలను పూడ్చి రోడ్డును మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ నాయకులు ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాస ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున ముదిగుబ్బ పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులతో పాటు టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్చార్జ్ కందికుంట వెంకటప్రసాద్‌తో పాటు ఆ పార్టీ ముదిగుబ్బ మండల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ కందికుంట వెంకట ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు అధ్వానంగా తయారై వాహనాలు సంచరించ దానికి వీలు లేకుండా పోయా యన్నారు, ఇప్పటికైనా ముదిగుబ్బ నాలుగు రోడ్ల కూడలిలో నిత్యం జన సంచారం ఉన్న జాతీయ రహదారిలో దెబ్బతిన్న రోడ్డును తక్షణమే బాగు చేయాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో సీపీఐ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, పార్టీ సీని యర్ నాయకులు గుంజేపల్లి కృష్ణయ్య, పార్టీ రైతు సంఘం నాయకులు డా.రామకృష్ణ, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, స్థానిక నాయకులు లింగప్ప, శంకర, రాధాకృష్ణ తుమ్మల చిన్నప్ప వెంకటనారాయణ, కొ డయ్య మహమ్మద్ హుస్సేన్, దామోదర మంగళ శీనా, వెంకటేశ్వర నాయక్, ప్రసాద్ నాయక్, ముస్కిన్, శివయ్య, వెంగ మణిలతో పాటు ఏఐఎస్ ఎఫ్ మండల నాయకులు దేవేంద్ర నాయక్, టీడీపీ నాయ కులు తుమ్మల మనోహర, తుమ్మల సూరి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు

విశాలాంధ్ర-పుట్టపర్తి: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ సమస్యల పరిష్కారానికి అధికారులందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. శనివారం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, డి ఆర్ ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అట్రాసిటీ కేసులకు సంబంధించి కేసులలో బాధితులకు న్యాయం చేయడంతో పాటు పరిహారం అందించేందుకు త్వరిత గతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అట్రాసిటీ చట్టం పైన ఎస్సీ ఎస్టీ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ మెంబర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం అర్ధ ఎగర స్థలాన్ని సేకరించా లన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీలలో అవసరమైన స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. అందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల లోపల రెవెన్యూ అధికారులు స్థల సేకరణ పూర్తి చేయా లని ఆదేశించారు. ప్రతి నెల మండలాల పరిధిలో ఒక గ్రామంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. అందుకు ప్రణాళికలు తయారు చేసుకుని అమలు చేయాల్సిన బాధ్యత ఆర్డీవో లపైన, తహసీల్దార్లపై ఉందన్నారు. గత సమావేశ ంలో చర్చించిన అంశాలను పరిష్కరించామని తెలిపారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నారు. సికేపల్లి మండలంలో దళితుల స్మశాన వాటిక స్థల సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. ముది గుబ్బ మండలంలో జెకేపల్లి తండా ప్రజలకు సిసి రోడ్లు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీ భూ సమస్యలపై త్వరలో జాయింట్ కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుం దన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారి సమస్యలపై నిరంతరము పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రధానంగా స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, ఆర్డీవో లు భాగ్యరేఖ, వంశీకృష్ణ, సురేష్ రెడ్డి, డి.ఎస్.పి వాసుదేవన్, పెనుకొండ డి.ఎస్.పి హుస్సేన్ పీరా, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, కమిటీ సభ్యులు వీరనారా యణ, ఆరుద్ర, గంగులయ్య, శ్రీనివాసులు, సురేష్, శ్రీహరి పాల్గొన్నారు.

ఇద్దరి జీవితాల్లో వెలుగులు..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పార్థసారధి నగర్(సిరి కల్చర్ ఆఫీసర్ దగ్గర)కు చెందిన డిపి. నారాయణరెడ్డి భార్య దోలా రాజ్యలక్ష్మి (74) భర్త మృతి చెందారు. కుటుంబ సభ్యులు విశ్వదీప సేవా సంఘం వారికి సమాచారాన్ని అందిం చగా, వారు ఇంటి వద్దకు చేరుకొని నేత్ర దానంపై అవగాహన కల్పించారు. తదుపరి సంఘం ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీ షియన్ నాగరాజు ద్వారా నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన దాత భర్త నారాయణరెడ్డి, కుమారులు రాఘవేందర్ రెడ్డి, జయ ప్రకాష్ రెడ్డి, కోడలు రూప, శ్రీనివాసరెడ్డిలకు విశ్వదీప సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు గాజుల సురేష్, కార్యదర్శి శేఖర్ రెడ్డితో పాటు కేశవరెడ్డి, రఘు పాల్గొన్నారు.

అన్నదానం దైవ సేవతో సమానం..

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, సహాయకు లకు, దాతల ద్వారా అన్నదానం చేయడం దైవ సేవతో సమానమని శ్రీ సత్య సాయి సేవ సమితి శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని 400 మంది రోగులకు, సహాయకు లకు భోజనపు ప్యాకెట్లను ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యుల చేతుల మీదుగా అందించారు. గర్భిణీ స్త్రీలకు స్వీట్లు కూడా పంపిణీ చేశారు. అనంతరం శ్రీ సత్య సాయి సేవ సమితి వారు మాట్లాడుతూ దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాలను పుట్టపర్తి సత్యసాయిబాబా ఆశీస్సులతో నిర్వహించడం మాకెంతో సంతోషంగా ఉందన్నారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ నజీర్ మాట్లాడుతూ సత్య సాయి సేవా సమితి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు రోగులకు ఉపయోగపడటంతో పాటు వరం లాగా మారడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఇటువంటి కార్యక్ర మాలకు దాతలు ఎవరైనా ఆసక్తి చూపితే సెల్ నెంబర్ 9966047044 , 903044065కు సంప్రదించవచ్చునని తెలిపారు.

కచ్చితంగా టీడీపీ జెండా ఎగురుతుంది..

- ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జి పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో కచ్చితంగా టీడీపీ జెండా ఎగురుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పోతుల నాగేపల్లి,కన్నంపల్లి గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మినీ మెనీ మెనీ ఫస్ట్ ఒక సంబంధించిన పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటుచూసినా సమస్యలు కనిపిస్తున్నా యని అభివృద్ధి అన్నది ఈ వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా కనిపించలేదని దుయ్యబట్టారు. కేవలం కొందరికి మాత్రమే సంక్షేమ పథకాలను అందించి మొత్తం అంతా మంచి చేస్తామన్న భ్రమలో నేడు ఈ ప్రభుత్వం ఉంద న్నారు. ఇప్పటికే గ్రామ ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గంలో అధికార పార్టీ అరాచకాలకు అడ్డుకట్టు వేయాలంటే అది ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఎవరు అడ్డంకులు సృష్టించిన, బెదిరింపులకు గురిచేసిన, ధర్మవరంలో తెలుగు దేశం పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని స్పష్టం చేశారు. అధికా రంలోకి వచ్చినాక గ్రామాల్లో సమస్యలన్నీ తప్పక పరిష్కరిస్తామని తెలి పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, రూరల్ కన్వీ నర్ లక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ రామాంజనేయులు, మాజీ ఎంపీపీలు మద్ది లేటి, వేణుగోపాల్‌రెడ్డి, గోట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, కమతం కాటమయ్యతో పాటు ఆది, రామంజి, ధనశేఖర్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ జన్మదిన వేడుకలకు తరలిరండి

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక జెడ్పీటీసీ మన ప్రియతమ నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బి.అనంత రాజు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకుంటున్నట్లు వైకాపా మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలి పారు. ఐదు మండలాలకు సంబంధించిన వైకాపా కార్యకర్తలు, కుంచిటి వక్కలిగా కుల బాంధవులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ముందుగా హెుట్టేబెట్ట పంచాయతీ కేంద్రంలో ఉదయం 10 గంటలకు కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. తర్వాత బైక్ ర్యాలీతో రొళ్ల పట్టణానికి చేరుకోవడం జరుగుతుంది. అక్కడ ఉన్న వైయస్సార్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,వాల్మీకి మహర్షి విగ్రహాలకు నివాళులర్పించిన తర్వాత లక్ష్మినరసింహస్వామి దేవా లయం వరకు ర్యాలీగా వెళ్లి స్వామి వారికి విశేష పూజలు, అనంతరం ఆలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి అభిమానుల నడుమ కేక్‌కట్ చేస్తామన్నారు. సర్పంచులు, వైఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలో నగర పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు శనివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తమ సమ స్యలు వెంటనే పరిష్కరించా లని కోరారు. న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు.

స్తంభంపై నుండి పడి గాయాలు

విశాలాంధ్ర-గోరంట్ల: రోడ్డు విస్తరణ పనులలో భాగంగా పాత విద్యుత్ స్తంభాల లైను మారుస్తున్న కూలీకి కరెంట్ షాక్ తగలడంతో విద్యుత్ స్తంభం పై నుండి కిందపడి గాయపడ్డాడు. మండలంలోని కొత్తచెరువు రోడ్డులో గల విస్తరణ పనులలో భాగంగా గుంతపల్లి వద్ద గల గార్మెంట్ సమీపంలో విద్యుత్ లైను మారుస్తుండగా కలకత్తా ప్రాంతంలోని మాల్ ధట్టా గ్రామానికి చెందిన తమిజ్ ఉద్దీన్ అను కూలీ స్తంభంపై నుండి పడి గాయపడ్డాడు. ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూ పురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

గోవిందరాజులపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభం

విశాలాంధ్ర-ఎన్‌పికుంట: కదిరి-రాయ చోటి రోడ్డు నుండి గోవింద రాజులపల్లి వరకు రూ. 64 లక్షల రూపాయలతో నూత నంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును శనివారం కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారన్నారు. కదిరి నియోజకవర్గంలో 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లను నిర్మించి అత్యవసర సేవలను అందుబాటు లోకి తీసుకొచ్చామన్నారు. గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు తన పరిపాలనలో ఏనాడు కూడా గంపడు మట్టి కూడా వేసిన పరిస్థితి లేదని, ఈనాడు జగనన్న చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక లేనిపోని అబద్దాలతో బురద చల్లే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ కూడా ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిల్షాద్, వైసీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, ఎంపీపీ రాము, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, వాటర్ షెడ్ చైర్మన్లు ఓబుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, బయ్యా రెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు అల్లా బకాష్, రామచంద్రారెడ్డి, తిరుపాలు, చెన్న కృష్ణారెడ్డి,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ కౌన్సిలర్లు

కదిరి సాధారణ కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

విశాలాంధ్ర-కదిరి: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని వైసీపీ పార్టీ కౌన్సిలర్లు బహిష్కరణ చేశారు. శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి చేర్మన్, వైస్ చైర్మన్,26మంది వైసీపీ పార్టీ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరణ అనంతరం వారు మాట్లా డుతూ దశాబ్ద కాలం పాటు పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా డా. సిద్దారెడ్డికె మరోమారు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 2014 నుండి పార్టీ అభివృద్ధికి బలోపేతానికి కృషి చేసిన వ్యక్తిని కాకుండా మరొకరికి అవకాశం కల్పించడం ఎమ్మెల్యేని అవమానం చేసేలా అధిష్టానం నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి నాయకులకు కార్యకర్త లకు అండగా ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచు కుంటూ నియోజక వర్గంలోని ప్రతి గడపకు తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరించుకుంటూ ప్రజలతో మమేకమైన డా.పీవీ సిద్ధారెడ్డికి టిక్కెట్టు కేటాయించా లని కోరారు.

పెనుగొండలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయం ముందు శనివారం నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూక్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు ముఖ్యంగా నగర పంచాయతీ పరిధిలోని పెనుకొండ నుంచి కోనాపురం రోడ్డు పరమతుల కోసం 70 లక్షల రూపాయలు మరియు పట్టణంలో తాగునీటి పైప్లైన్లు వేయడానికి 90 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు కౌన్సిల్ ఆమోదం తెలిపారు ఇంకా వివిధ అభివృద్ధి పనులకు అజెండా ప్రకారం కౌన్సిల్ ఆమోదం తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు కమిషనర్ వంశీకృష్ణ భార్గవ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన సీఎం జగన్

- మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి: ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని బ్రస్టు పట్టించి అప్పులపాలు చేశాడని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. శనివారం పార్టీ కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 730 హామీలు ప్రజలకు ఇచ్చాడని అయితే ఇందులో 109 మాత్రమే అమలు చేశాడని మిగతా 85 శాతం అమలు చేయలేదన్నారు. అయితే 99 శాతం అమలు చేశామని జగన్ చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉన్నది అంటే ఒక ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. మేనిఫెస్టో తనకు భగవద్గీత, కురాన్, బైబిల్ అని చెప్పిన జగన్ అందులోని అంశాలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు ఇస్తానని నీతులు పలికిన జగన్ నేడు అంగన్వాడీలు రోడ్డు ఎక్కిన పరిస్థితిని ఏమంటారు అని ప్రశ్నించారు. అలాగే మున్సి పల్ కార్మికులకు తాను అధికారం లోకి వస్తానని 6 నెలల లోపే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. నాలుగున్నర సంవత్సరాలు అయినా తమ సమస్యలు పట్టించుకోలేదని కార్మికులు సమ్మెబాట పట్టాలన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో ఈ సమ్మె వల్ల ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధ్యం లోపించిందన్నారు. ప్రపంచ దేశాలలో సైతం సిగ్గుతో తలవంచుకునే పరిస్థితి జగన్ తెచ్చా రన్నారు. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ నిధులను రూ.12 వేల కోట్లు వేరే పనులకు వాడుకున్నార న్నారు. పీఆర్‌సీ హామీని నెరవేర్చనందున ఉద్యోగు లలో కూడా ఆగ్రహం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఆటకెక్కించారన్నారు. బస్ చార్జీలు, విద్యుత్ ఛార్జీలు, డీజలు పెట్రోలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి అని చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. 2024 ఎన్నికలలో టిడిపి విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అరాచకాలు, దాడులు, దౌర్జన్యాల కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జనవరి 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

విశాలాంధ్ర-ధర్మవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు నమో దు కార్యక్రమం, అభ్యంతరాల స్వీకరణ ను జనవరి 12వ తేదీ వరకు పొడిగిం చినట్లు తాసిల్దార్ యుగేశ్వరి దేవి తెలి పారు. ఆన్‌లన్ ద్వారా, బిఎల్ ద్వారా, స్థానిక తహసిల్దార్ కార్యాలయం ద్వారా ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును పొందాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులు, ఫారం-6,7,8లలో గల నూతనంగా ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు, బదిలీలకు అవకాశం కలగని తెలిపారు. ఈ గడువు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఆన్‌లైన్ తదితర ద్వారా వచ్చిన వాటిని విచారణ జరిపి, జనవరి 22న ఓటర్ జాబితా ప్రకటి స్తామన్నారు. 27/10/2023వ తేదీ వరకు నియోజక వర్గంలోని నాలుగు మండలాలలో పురుషులు, స్త్రీల మొత్తం ఓటర్లు 2,35,067 కలవని తెలిపారు. ఇందులో ధర్మవరం రూరల్ 33,314, ధర్మవరం అర్బన్ 1,02,075, తాడిమర్రి 23,810, ముదిగుబ్బ 44,418, బత్తలపల్లి 31,450 కలవని తెలిపారు. తదుపరి 28/10/2023 నుండి ఆన్లైన్ ద్వారా ప్రజల ద్వారా వచ్చిన క్లెయిమ్స్ ఫారం-6కు (నూతన ఓటరుగా నమోదు) 11,138, ఫారం-7కు (తొలగింపులు) 13,166, ఫారం-8 కు(మార్పులు, బదిలీలు) 7,922 వచ్చాయని, క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీల ద్వారా విచారణ చేపట్టిన ద్వారా బిఎల్ఓ ల ద్వారా పై వివరాలు రావడం జరిగిందన్నారు. అదేవిధంగా డిసెంబర్ 9వ తేదీ వరకు నూరు శాతం పూర్తి చేశా మన్నారు. డిసెంబర్ 10 తరవాత వచ్చే క్రైమ్స్ ను జనవరి 12లోగా పూర్తి చేస్తామని తెలిపారు. జనవరి 22న ఓటర్ జాబితాను ప్రకటిస్తామన్నారు. ఇంతవరకు ఓటు హక్కు లేనివారు, తొలగింపులు, మార్పులు, బదిలీల కొరకు జనవరి 12వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

అనంత బాలోత్సవానికి చేయూత..!

విశాలాంధ్ర-ధర్మవరం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు 36 అకాడమిక్, 26 సాంస్కృతిక విభాగాల్లో మొత్తం 62 ఈవెంట్లలో జరిగే 2024 అనంత బాలోత్సవం పిల్లల పండుగ ఫిబ్రవరి 5,6,7 తేదీలలో ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్, న్యూ టౌన్, అనంతపురం నందు జరిగే కార్యక్రమానికి ధర్మవరం పట్టణానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ వారు రూ.20 వేల చెక్కును బాలోత్సవ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వి.సావిత్రి ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయ చంద్రా రెడ్డి, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు రమణయ్య, భూతన్న, జస్వంత్, కృష్ణజ చేతుల మీదుగా నగదును అందజేశారు. సావిత్రి ఆత్మీయ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మా సమస్యలు పరిష్కరించేంత వరకు ఎంతటికైనా సిద్ధం

విశాలాంధ్ర-ధర్మవరం: 19 రోజులుగా తాము న్యాయమైన సమ స్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తూ ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, మా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఎంతటికైనా సిద్ధమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పోతక్క, దీన, మాన్చాలిని దేవి,అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి లలిత తెలిపారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని సచివాలయాల వద్ద నిరసన తెలియజేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంద జేశారు.. ప్రభుత్వం తమ పట్ల కనికరం లేకుండా వ్యవహరించడం తగదన్నారు. కనీస వేతనం కావాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి... పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఎదుట వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టిన కూడా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సంఘం నాయకులు పేర్కొన్నారు. వీరి సమ్మెకు సిఐటియు నాయకులు మద్దతు పలికారు. శనివారం నల్లబట్టలు వేసుకుని నిరసన తెలిపారు. ఆనాడు జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయం లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడిచినా కూడా మా డిమాండ్లను తీర్చలేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అయూబ్ ఖాన్‌తో పాల్గొన్నారు.

ధర్మవరం సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్లకు 18 పతకాలు

విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ సత్యసాయి డివిజన్లోని ఏడు డివిజన్ లో గల పోలీస్ స్టేషన్లకు ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు మూడు రోజులపాటు పుట్టపర్తిలో ఏపీ పోలీస్ అన్యువల్ స్పోర్ట్స్ మీట్..2023 వివిధ క్రీడలు నిర్వహించబడ్డాయి. ఈ క్రీడలు డిఎస్పి శ్రీనివాసులు, బత్తలపల్లి ఎస్సై, పట్నం ఎస్సై ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగాయి. ధర్మవరం సబ్ డివిజన్లో 26 మంది విజేతగా కావడం జరిగింది. ఈ క్రీడల్లో వాలీబాల్, బాస్కెట్బాల్, సెటిల్, కబాడీ, జావిలిన్ త్రో, షాట్ పుట్, డిస్కస్ త్రో, పరుగు పందెం లాంటి క్రీడలు అత్యంత ఉత్సాహపరంగా కొనసాగాయి. ఇందులో ధర్మవరం సబ్ డివిజన్ కు గాను 18 పతకాలతో పాటు, ప్రశంసాపత్రాలు, మెడల్స్, మెమెంటోల్లను గెలుచుకున్నారు. అదేవిధంగా జిల్లాలోని ఏడు డివిజన్లో పుట్టపర్తి ఓరల్ ఛాంపియన్షిప్లో రన్నర్‌గా మొదటి కప్పును అందుకోగా, ధర్మవరం డివిజన్ రన్నర్గా ద్వితీయ బహుమతిని అందుకున్నారు. ధర్మవరం డివిజన్ పోలీసులు వివిధ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు గాను ఎస్పీ మాధవరెడ్డి డీఎస్పీ శ్రీనివాసులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఆలయానికి ఇత్తడి పూజా సామగ్రి అందవేత



విశాలాంధ్ర-ధర్మవరం: కొత్తపేటలో గల శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు 9600 విలువచేసే ఇత్తడి పూజా సామాగ్రిని ముదుగుబ్బ మండలం ఎనుముల వారిపల్లి గ్రామానికి చెందిన బెస్త హరి సతీమణి విజయలక్ష్మితో సహకా రంతో ధర్మవరం బెస్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇత్తడి పూజా సామాగ్రిని అర్చకులు సుదర్శన ఆచార్యులు, సునీల్ కుమారా చార్యులులకు అందజేశారు. కార్యక్రమంలో బెస్త నారాయణస్వామి, బెస్త నడిపి వెంకటరాముడు, రామకృష్ణమ్మ, గంగమ్మ, సుశీలమ్మ ,చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదాస విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-పెనుకొండ: కుప్పం నియోజకవర్గ కేంద్రంలో కురుబ కుల ఆరాధ్యదైవం శ్రీభక్త కనకదాసు విగ్రహం ను ఆవిష్కరించిన మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ //రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ని ఘనంగా సత్కరించి కనకదాసు చిత్ర పటాన్ని అందచేసి సభను ఉద్దేశించి సవిత మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని కురుబ కులస్తులు అత్యధికంగా ఉన్నారని, రాజకీయంగా వారికి తెలుగుదేశం పార్టీలో మంచి అవకాశాలు కల్పించాలని స్థానిక సంస్థలు ఎన్నికలలో కూడా కురుబ కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ప్రసంగించారు. ఆమె ప్రసంగానికి సభికులు పెద్ద ఎత్తున జేజేలు పలికారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కురుబలకు గెలిచే వారికే టికెట్లు ఇస్తామని అవసరమున్న చోట ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తామని, రాజకీయ ప్రాధాన్యత తెలుగుదేశం పార్టీలోనే ఎక్కువగా ఉంటుందని, బీసీలలో కురువలు నమ్మకస్తులుగా ఉన్నారని వారికి మంచి ప్రాధాన్యత కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న కురుబ కులస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

హిందూపురంలో ఆందోళన చేస్తున్న నాయకులు

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా శనివారం ఏఐటీయూసీ నాయకులు కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చర్చల ద్వారా కాలయాపన చేస్తున్నదని, మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, అది అమలు చేయాలని జనవరి మూడో తేదీ నుండి ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు సమ్మె ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ వర్తింపజేయాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి, సీనియర్ నాయకులు ఇస్మాయిల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సురేష్, అధ్యక్షులు ముత్యాలప్ప, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు అఖిల్ రాజ్, కార్యదర్శి ఉదయ్, ఉపాధ్యక్షులు రంజాని, వరదరాజులు, నరేష్, సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మి, భాస్కర్, పారిశుద్ధ్య కార్మికులు ఈరప్ప, వినోద్ అంజి, నవీన్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 31, డిసెంబర్ 2023

వేతనాలు పెంచే వరకు పోరాటం సాగిస్తాం

విశాలాంధ్ర-ఎన్‌పికుంటలో..

కొత్తచెరువులో..

లేపాక్షిలో..

విశాలాంధ్ర-ఎన్‌పికుంట: ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచే వరకు పోరాటం సాగిస్తామని అంగన్వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె 18వ రోజుకు చేరిన సందర్భంగా శనివారం ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో తమ డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. నెలకు రూ.18000 జీతం ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. ఇప్పటికే అంగన్వాడీలు, మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు, కేజీబీవీ, ఔట్సోర్సింగ్ వర్కర్లు ఇలా అనేక తరగతులు వాళ్ళు రోడ్లమీదకు వచ్చి పోరాటం చేస్తున్నారని, ఇదే అసలైన సమయమని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాట్లాడే, పోట్లాడే, పోరాటం చేసే అవకాశం ఇవ్వరని బేషజాలకు పోకుండా జగన్మోహన్ రెడ్డి దిగివచ్చి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

విశాలాంధ్ర-కొత్తచెరువు: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ డివిజన్ నాయకులు అంజి, అంగన్వాడీల మండల ప్రధాన కార్యదర్శి షర్మిల తెలిపారు. శనివారం కొత్తచెరువులో ఒకటవ సచివాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లు కలిసి ధర్నా నిర్వహించారు. 19 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పోలీసులు ద్వారా సమ్మెను అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నదన్నారు. గతంలో సచివాలయ ఉద్యోగులతో అంగన్‌వాడీ కేంద్రాలు నడపాలని బెదిరింపులకు పాల్పడ్డారు అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపిన కూడా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ జీతాలు ఇస్తున్నారని మన రాష్ట్రంలో ఇవ్వాలని కోరితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

విశాలాంధ్ర-లేపాక్షి : సమస్యలు పరిష్కరించాలని జరుగుతున్న అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు సంపూర్ణ ఆధ్వర్యంలో 19వ రోజు శనివారం కూడా నిరసనలు వెల్లువెత్తాయి. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రిటైర్డ్ బెనిఫిట్స్, యాప్ల తొలగింపు, తదితర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చిలమత్తూర్ రూరల్ : దేమకేతేపల్లి సచివాలయం వద్ద..

పెనుగొండ గడ్డ.. శంకరన్న అడ్డ..

-పెనుగొండ వైసీపీ టికెట్ మాలగుండ్ల శంకరన్నకే ఇవ్వాలి....
- గోరంట్ల,పెనుగొండల్లో వైకాపా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...

విశాలాంధ్ర-గోరంట్లలో..

విశాలాంధ్ర-గోరంట్ల: తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న పెనుగొండ గడ్డపై మాల గుండ్ల శంకర నారాయణ వైసీపీ పార్టీ అడ్డగా మార్చారని... అలాంటి సందర్భంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొత్త వ్యక్తులకు ఎమ్మెల్యే సీటు కేటాయించడం బాధాకరమని వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పునరాలోచించుకొని.... పెనుకొండ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాల గుండ్ల శంకర్ నారాయణకే ఇవ్వాలని.... డిమాండ్ చేస్తూ గోరంట్ల పట్టణంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు... పెనుకొండ గడ్డ... శంకరన్న అడ్డ అంటూ.. కావాలి కావాలి శంకరన్నకే పెనుగొండ కావాలి అంటూ నినాదాలు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి గుమ్మయగారిపల్లి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి వైఎస్ఆర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ప్రతి గడపకు వెళుతూ ప్రతి ఒక్కరిని పేరు పెట్టి పిలుస్తూ... ఆప్యాయంగా పలకరిస్తూ కుటుంబ సభ్యుడిగా అభిమానిస్తున్న సందర్భంలో కొత్త వ్యక్తులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికలలో పెనుగొండ ఎమ్మెల్యే స్థానం గెలవాలంటే మాల గుండ్ల శంకర నారాయణకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు, కొంతమంది చేస్తున్న గ్రామాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించి మాల గుండ్ల కే టికెట్ కేటాయించాలన్నారు, నియోజకవర్గంలో గతంలో ఎన్నడు జరగని అభివృద్ధి శంకర్ నారాయణ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిందని, ఇలాంటి సందర్భంలో మంత్రి ఉషశ్రీ చరణ్ కు పెనుగొండ ఎమ్మెల్యే స్థానం కేటాయిస్తే వైసిపి కార్యకర్తలు ఆత్మహత్యలకు కూడా వెనకాడమని వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పునరాలోచించుకొని వాస్తవాలు తెలుసుకొని శంకరన్నకు పెనుగొండ ఎమ్మెల్యే స్థానం అధికారికంగా ప్రకటిం చాలని డిమాండ్ చేశారు, ర్యాలీ కార్యక్రమంలో సర్పంచ్ సరోజా నాగే నాయక్, జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీపీ ప్రమీల మూర్తి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నూర్ మొహమ్మద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్, జెడ్పి కోఆప్షన్ డాక్టర్ భాష, మండల సచివాలయ కన్వీనర్ సమరసింహారెడ్డి, ఎన్జీవో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, సర్పంచులు అశ్వత్ రెడ్డి, ప్రభాకర్ రావు నర్సిరెడ్డి, రామాంజనేయులు, పార్వతి రమణా నాయక్, వాసుదేవ నాయక్, పాల సముద్రం చిన్న గంగప్ప, గోవింద రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ప్రభావతి, ఆది వెంకటరమణ, శ్రీరాములు పాల్గొన్నారు.

మాల గుండ్లకు మరో అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర-పెనుకొండ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మరోసారి మాల గుండ్ల శంకర్ నారాయణకు అవకాశం కల్పించాలని పెనుకొండ మండలం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. 2014 నుండి పెనుకొండలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వచ్చారు. అలాంటి ఎమ్మెల్యేని మార్చకుండా మరోసారి శంకర్ నారాయణకు అవకాశం ఇవ్వాలన్నారు. మండలాధ్యక్షుడు ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో తన వంతు మార్పును చూపించారని తెలిపారు.

వైసీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర-తాడిమర్రి: వైఎస్ఆర్సిపి పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం తాడిమర్రి మండల పరిధిలోని దాడి తోట, చిల్లా కొండయ్య పల్లి, గ్రామాలలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వారు తెలియజేశారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వము యొక్క సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి యొక్క సమస్యలను, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పింఛన్లు, ఆసరా,విద్యా దీవెన, వాహన మిత్ర, రైతు భరోసా వంటి మహోన్నత పథకాలు యొక్క అమలు తీరును కూడా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి పథకాలు అందుతున్నాయా? లేదా? అన్న విషయంతో పాటు, సచివాలయ వాలంటీర్ వ్యవస్థ పై వారు ఆరా తీశారు. సచివాలయాలు మీకు ఉపయోగంగా ఉన్నాయా? లేదా? అన్న విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రం ఇంకనూ అభివృద్ధి చెందాలి అంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి అత్యధిక మెజార్టీతో ప్రజలు జరిపించాలని వారు కోరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి నాయకులతోపాటు ఆయా గ్రామ ప్రజలు డప్పు వాయిద్యాలతో, మంగళ వాయిద్యాలతో, మంగళ హారతులతో, పూలహారాలతో స్వాగతం పలికారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామ ప్రజల అపూర్వ ఆదరణ నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దాడి తోట చంద్రశేఖర్ రెడ్డి, తాడిమర్రి మండల కన్వీనర్ బేల్దారి రామాంజనేయులు వైయస్సార్సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు, కన్వీనర్ మాధవరెడ్డి, అగిలే సాయినాథ్ రెడ్డి తోపాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు పుట్టపర్తి ఎమ్మెల్యే ఆర్థిక సాయం..

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన పలువురిని పరామర్శించారు. మరికొందరికి ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన వైకాపా నేత ఈశ్వర్ రెడ్డి ఇటీవల వెన్నెముక కు శత చికిత్స చేయించుకుని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి లోచర్ల గ్రామానికి వెళ్లి వైకాపా నేత ఈశ్వర్ రెడ్డిని పరామర్శించారు. చికిత్స జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా లోచర్ల గ్రామానికి చెందిన రామిరెడ్డి భార్య అనసూయమ్మ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అనసూయమ్మను పరామర్శించారు. కోడప గాని పల్లి గ్రామానికి చెందిన జగన్మోహన్ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి కోడప గాని పల్లి గ్రామానికి వెళ్లి జగన్మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ రమణారెడ్డి, ఎంపీపీ భర్త రెడ్డప్ప రెడ్డి వైకాపా నేతలు అశోక్ రెడ్డి, వెంకటేష్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై అవగాహన

విశాలాంధ్ర-గుడిబండ: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వికసిత్ భారత్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో డి.రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నదని, వీటిపై గ్రామీణ స్థాయిలో చాలామందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదన్నారు. అందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పూర్తి సమాచారాన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు అందజేయడమే వ్యవసాయ గిరిజనాభివృద్ధి సంక్షేమ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశని తెలిపారు. కార్యక్రమంలో గుడిబండ ఎంపీడీవో రామారావు, ఎంపీపీ రాధమ్మ, మండలఈవోఆర్డి నాగరాజు నాయక్ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం...

విశాలాంధ్ర-అమడగూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ బలరాం, పోలీస్ సిబ్బంది మండల పరిధిలోని రామనాధపురం గ్రామ శివారులలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా రాబడిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం నుండి ఆంధ్రాకు అక్రమ మద్యాన్ని తరలించి ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తున్న కర్ణాటక రాష్ట్రం సద్దపల్లి తాండ గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయక్ ను అరెస్టు చేసి అతని వద్ద నుండి 572 టేట్రాప్యాకెట్లు ను స్వాధీనం చేసుకుని ముద్దాయిని రిమాండ్ నిమిత్తం కదిరి కోర్టుకు తరలించడమైందని ఎస్.ఐ. తెలిపారు. అక్రమ మద్యాన్ని ఎంతో చాకచక్యంగా పట్టుకున్నందుకు సిఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఎస్.ఐ. బలరామయ్యను, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

రఘువీరాకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర మండలంలోని భక్తరపల్లి లక్ష్మినరసింహ స్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సిడబ్ల్యుసి మెంబర్ మాజీ మంత్రి.రఘువీరారెడ్డి ,మాజీ ఏమ్మెల్యే సుధాకర్,ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ క్రమంలో మండల అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బయ్యపురెడ్డ గుడిబండ మండల అధ్యక్షులు నాగరాజు, వై.బి. హళ్లి, హరేసముద్రం పంచాయతీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రఘువీరారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

క్యాలెండరు ఆవిష్కరించిన డీఈఓ

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఏపీయూఎస్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ను విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ మీనాక్షి ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ క్యాలెండర్ను ముద్రించి తీసుకురావడం పట్ల ఆ సంఘం నాయకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడి నాగరాజు, జిల్లా అధ్యక్షులు అమర చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : యూటీఎఫ్ 2024 డైరీ క్యాలెండర్ ను ఎంఈఓ వీరన్న, బొమ్మనహాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమార్‌లు శనివారం బొమ్మనహాళ్ ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. గోవిందరాజులు మాట్లాడుతూ యుటిఎఫ్ పోరుబాటలో భాగంగా ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న పీఆర్సి రియర్సు డిఆర్ఇయర్స్ పిఎఫ్ లోన్లు ఫైనల్ సెటిల్మెంట్లు ఎపిజిఎల్ఐ సరెండర్ లీవ్ తదితర రేర్లు 1836 కోట్లు ప్రభుత్వం బకాయి పడ్డది కావున బకాయి పడ్డ ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, జనవరి 3 తారీకున జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నా, జనవరి 9, 10 విజయవాడలో 36 గంటల ధర్నాలి పిలుపు ఇచ్చినది. మండలం నందలి యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు హాజరై జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు. ఎంఈఓ వీరన్న మాట్లాడుతూ యుటిఎఫ్ ఐక్యంగా అనేక పోరాటాలు చేస్తూ ఉందని అదేవిధంగా యుటిఎఫ్ ముద్రించిన 2024 డైరీ ఉపాధ్యాయులకు అవసరమైన జీవోలు, అనేక అంశాలు పొందుపరిచారని ఇది చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి ఎం. ఆంజనేయులు మాట్లాడుతూ పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లు పదవ తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ట్రెజరర్ అశోక్, మహిళా కన్వీనర్ వాణిశ్రీ, రామలింగాదేవి ,సునీత ,బ్రహ్మేశ్వరి, శివప్రసాద్, రవికుమార్ త్రినాథరావు వీర ఓబులేసు, రామానాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

తూముకుంట పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని తూమకుంట పంచాయతీలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ. కెంచరాయప్ప, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పరామర్శించిన ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్

విశాలాంధ్ర- ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్ శనివారం ఎమ్మెల్సీ శివరామ రెడ్డి ని మరియు వారి కుటుంబ సభ్యులను కొనకొండ్ల గ్రామంలో కలిసి ఆత్మీయంగా పరామర్శించారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి ఈనెల ఏడవ తారీఖున స్వర్గస్తులైన విషయం విధితమే ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సతీమణి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ శివరామ రెడ్డిని ఆయన కుమారుడు భీమిరెడ్డిని ఆత్మీయంగా ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఉమాదేవమ్మ ఆత్మ కు ఆ భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరుతూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర్ ఉమాదేవమ్మ జ్ఞాపకాలను వారి కుటుంబ సభ్యులతో పంచుకున్నారు ఎమ్మెల్సీని పరామర్శించిన వారిలో కనేకల్ మాజీ ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి, కనేకల్ సింగల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, పలువురు రాజకీయ నాయకులు, వైసిపి కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణ యాదవ్ వైసీపీ సీనియర్ నాయకులు తిప్పారెడ్డి, దిద్దెకొండ సూర్య నారాయణ జరుట్లరాంపురం సర్పంచి తిరుపాల్ యాదవ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..

విశాలాంధ్ర -తాడిపత్రి: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఐదవ రోజు సమ్మె శిబిరం వద్దనే వంట వార్పు నిర్వహించి వినూత్నంగా మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పట్టణంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సిబ్బంది పెంచాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. జీవో నెంబర్ 7 అమలు చేయాలన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ దాదాపు నాలుగున్నర సంవత్సరం అయినప్పటికీ నెరవేర్చకపోవడం, ఐదు రోజుల నుండి మున్సిపల్ కార్మికులమైన మేము నిరవధిక సమ్మె చేస్తూ ఉన్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్లానింగ్ సెక్షన్ కార్మికులు రామాంజనేయులు, గోపాల్, యాసీన్ మున్సిపల్ కార్మికులు వన్నూరప్ప, లక్ష్మీదేవి, శంకర్, రాముడు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా జగదీష్

విశాలాంధ్ర-గుడిబండ: బీజేపీ అనంతపురం టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా మోరబాగాల్ జగదీష్ నియమితులయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను బిఎస్ఎన్ఎల్ టెలివిజన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు దగ్గుబాటి పురందరేశ్వరికి, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డికి, శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు మోహన్ శేఖర్ స్వామికి, మడకశిర అసెంబ్లీ కన్వీనర్ హనుమంతప్ప కి,కో కన్వీనర్ బసవరాజుకి, కిషన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్‌కి, రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, మండల బిజెపి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - అగళి : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం లో శనివారం మండల విద్యాధికారి చంద్రశేఖర్ నాయుడు చేతుల మీదుగా యుటిఎఫ్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. 2024వ నూతన సంవత్సరం పురస్కరించుకొని ఈ క్యాలెండర్ ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు కాటప్ప, మండల అధ్యక్షులు శివశంకర్ జిల్లా కార్యదర్శి హరికృష్ణ,ప్రధాన కార్యదర్శి రవి,ఉపాధ్యాయులు అమర్నాథ్,దేవరాజ్,హసీనా తదితరులు పాల్గొన్నారు.

అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో లింగం చంద్రశేఖర్ మనవరాలు మనస్వి పుట్టిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు లీలావతి వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం చేసినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రం కమలపాడు రోడ్డు ఉన్న ఆగాపే వృద్ధాశ్రమంలో జూటూరు మహమ్మద్ అనీఫ్, జూటూరు షహనాజ్ కుమారుడు హాజీ ఖాదిర్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు . ఈ కార్యక్రమంలో మనస్వి కుటుంబ సభ్యులు ఉమాదేవి, ప్రవీణ్ కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మాజీ ఎమ్మెల్యే..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆయన సతీమణి భువనేశ్వరి, వారి కుమారుడు యువనేత వై. ప్రణయ్ రెడ్డి ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ వేదపండితులు, అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసారు. ఆలయం వెలుపల మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.

వైసీపీ లీడర్ షావలి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద శనివారము వైసిపి రెండో వార్డ్ ఇంచార్జ్ షావలి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరయ్యారు. మొదటగా షావలి కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైసిపి రెండో వార్డ్ ఇంచార్జ్ షావలికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ షావలి ఇంకా ఎన్నో జన్మదిన వేడుకలు జరుపుకొని ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ వైసిపి ఎన్నో సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా షావలి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో తాను తమ వార్డులో వైసిపి అత్యధిక మెజార్టీతో గెలవడానికి శాయశక్తుల కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు షబ్బీర్, రియాజ్, నూర్ మొహమ్మద్, అబ్దుల్ పాల్గొన్నారు.

గోడకు వినతిపత్రం అంటించిన సీపీఐ నాయకులు..

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ పట్టణంలో నెలకొన్న రోడ్ల దుస్థితి గురించి వినతి పత్రం సమర్పించడానికి, శనివారం తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సిపిఐ నాయకులకు అక్కడ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కానీ లేకపోవడంతో గత్యంతరం లేక తమ వినతి పత్రాన్ని రెవెన్యూ కార్యాలయం ఎదుట గోడకు అతికించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శ చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉదయం 11:30 సమయం కావస్తున్న ముదిగుబ్బ రెవెన్యూ కార్యాలయంలో ఒక్కరు కూడా సిబ్బంది లేకపోవడం దారుణమని ఆవేదన చెందారు, ఇప్పటికైనా అధికారులు సకాలంలో కార్యాలయానికి హాజరై వివిధ సమస్యల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు, లేని పక్షంలో మేము సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలియజేశారు.

ఎస్సీ,ఎస్టీల సమస్యలను పరిష్కరించండి

జూపూడికి వినతి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఎస్సీ,ఎస్టీ కులాల వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని మాల మహా నాడు నాయకులు ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ రావునును కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం జూపూడి అనంతపురం నుంచి గుంతకల్‌కు వెళ్తుండగా వజ్రకరూరు మండల కేంద్రంలో ఆయనని వారు కలిశారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాలరామాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు దృష్టికి వారు తీసుకొచ్చారు. కార్యక్రమంలో మోకా నరసింహులు, బద్రీనాథ్ సున్నపురాళ్ల రాముడు, వడ్డే చిన్న శీనా,షేక్షా, సర్మస్ వలి, చాకలి నరసింహులు పాల్గొన్నారు.